



విధుల్లో చేరిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

పార్వతీపురం, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి) : పార్వతీపురం గిరిజన ఇంజనీరింగ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇన్‌చార్జిగా మణిరాజు పనిచేసిన విషయం తెలిసిందే. కాగా విధుల్లో చేరిన నూతన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కుమార్ విలేఖరులతో మాట్లాడుతూ.. గతంలో ఈ ప్రాంతంలో పని చేసిన అనుభవం తనకుందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గిరిజన ప్రాంతాల్లో రహదారులు, ఇతరత్రా అభివృద్ధి పనులు జరిగేలా చూస్తామన్నారు.

ఆ కష్టాలకు చెక్!

- రైతుకు నచ్చిన మిల్లుకే ధాన్యం విక్రయించుకోవచ్చు..
- ఆదేశాలిచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు
- గత వైసీపీ సర్కారు హయాంలో ఎన్నో ఇబ్బందులు
- వాటికి తెరదించిన కూటమి ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లావాసులు



పార్వతీపురం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ధాన్యం విక్రయాల్లో సమస్యలకు కూటమి ప్రభుత్వం చెక్ పెట్టింది. రైతులకు పూర్తి స్వేచ్ఛనిచ్చింది. వారికి సమీపంలోని ఇష్టమైన మిల్లుకు ధాన్యం తరలించుకునే వెసులుబాటు కల్పించింది. వాస్తవంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకునేందుకు అష్టకష్టాలు పడేవారు. ర్యాండమైజేషన్ విధానం వల్ల దూర ప్రాంతాల్లో ఉన్న మిల్లులకు ధాన్యం రవాణా చేయాల్సి వచ్చేది. దీంతో లేబర్, రవాణా చార్జీలతో రైతులు నలిగిపోయేవారు. కనీసం గోనె సంచులు కూడా గత ప్రభుత్వం సరఫరా చేసేవారు కాదు. అయితే ఈ ఖరీఫ్ సీజన్ నుంచి ధాన్యం సేకరణలో రైతులకు సాధ్యమైనంత వరకు ఇబ్బందుల్లేకుండా నిబంధనలను సరళతరం చేస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిపై జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఇలా..

గత వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన ర్యాండమైజేషన్ విధానం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు నానా అవస్థలు పడేవారు. వారికి ఇష్టమైన మిల్లులకు ధాన్యం తరలించలేకపోయేవారు. అప్పట్లో ప్రభుత్వం సూచించిన మిల్లులకే సంబంధిత ఆర్బీకే ద్వారా ధాన్యం విక్రయించాల్సి వచ్చేది. గతంలో వైసీపీ నాయకుల సిఫారసులు చెల్లుబాటు అయ్యేవి. అయితే ఇదే అదునుగా ప్రైవేట్ వ్యాపారులు, దళారులు రంగ ప్రవేశం చేసి రైతుల వద్ద తక్కువ ధరకే ధాన్యం కొనుగోలు చేసేవారు. అనంతరం తమ పలుకుబడిని ఉపయోగించి.. ఎక్కువ ధరకు వాటిని ఇతర జిల్లాలకు తరలించేవారు.


నూతన విధానం...

ధాన్యం సేకరణ ప్రక్రియలో రైసు మిల్లుల ర్యాండమైజేషన్ విధానాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. రైతులు తమకిష్టమైన మిల్లులకు ధాన్యం విక్రయించుకోవచ్చు. ఈ మేరకు అధికారులు వారికి సహకరించాల్సి ఉంది. రైతులకు అవసరమైన రవాణా వాహనాలు, గోనె సంచులను సమకూర్చనున్నారు. ధాన్యం ఎగుమతి, దిగుమతులకు అయ్యే లేబర్ చార్జీలను కూడా చెల్లించనున్నారు. కొనుగోలు ప్రక్రియలో అవకతవకలకు తావులేకుండా రైతుల బయోమెట్రిక్ ఆధారంగా ధాన్యాన్ని సేకరించనున్నారు. జీపీఎస్ పరికరాలు అమర్చిన వాహనాల ద్వారా మిల్లులకు ధాన్యం రవాణా చేయనున్నారు. మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ఆలస్యం కాకుండా తగినంత మంది హమాలీలను ఏర్పాటు చేయనున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

జిల్లాలో ఈ సంవత్సరం రెండు లక్షల 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ఏడాది సాధారణ రకం 100 కేజీల ధర రూ.2300, గ్రేడ్-ఏ రకం ధర రూ.2,320గా నిర్ణయించారు. రైతుల నుంచి కొనుగోలు చేసి ధాన్యాన్ని జిల్లాలోని 93 రైస్ మిల్లులకు పంపించనున్నారు. గత ఏడాది ఖరీఫ్‌లో రెండు లక్షల 21 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. సుమారు 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఇతర జిల్లాలకు తరలిపోయింది.





రైతుల ఇష్ట ప్రకారమే..

జిల్లాలో రైతులు వారికి సమీపంలో ఇష్టమైన మిల్లులకు ధాన్యం విక్రయించుకోవచ్చు. వారికి అవసరమైన సహకారాన్ని అందిస్తాం. సకాలంలో ధాన్యం కొనుగోలును పూర్తి చేస్తాం.

\- శ్రీనివాసరావు,
జిల్లా సివిల్ సప్లైస్ మేనేజర్, పార్వతీపురం మన్యం

మృగాళ్లను కఠినంగా శిక్షించాలి

- మహిళా రక్షణ అవగాహన సదస్సులో మంత్రి సంధ్యారాణి

సాలూరు రూరల్/పాచిపెంట, అక్టోబరు 5: మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడే మృగాళ్లను కఠినంగా శిక్షించాలని మహిళా శిశు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అధికారులకు పిలుపునిచ్చారు. శనివారం సాలూరులోని ఓ కల్యాణ మండపంలో జిల్లాస్థాయి మహిళా రక్షణ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణకు కూటమి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను మంత్రి వివరించారు. మహిళలు ధైర్యంగా ముందుకు సాగాలని, ఆపద సమయాల్లో పోలీసుల హెల్ప్‌లైన్ల నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల వద్ద హెల్ప్‌లైన్ల నెంబర్లు రాయించాలని ఆదేశించారు. బాల్య వివాహాలు చేయరాద న్నారు. పోలీస్ స్టేషన్లకు వచ్చిన బాధితులకు పూర్తి న్యాయం చేయాలని, వారికి అండగా నిలవాలని తెలిపారు. మృగాళ్లను కఠినంగా శిక్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. వారి తరపున లాయర్లు వాదించొద్దని కోరారు. తల్లిదండ్రులు అబ్బాయిలు, అమ్మాయిలను సమానంగా పెంచితే ఆడపిల్లల్లో మనోధైర్యం పెరుగుతుందన్నారు. సమాజంలో మార్పు రావాలని, ప్రతి ఒక్కరికీ మహిళలంటే గౌరవం ఉండాలని తెలిపారు. మహిళలపై ఎవరు అసభ్యకరంగా ప్రవర్తించినా సహించేది లేదని స్పష్టం చేశారు. కొన్నిచోట్ల చిన్నారులపై జరిగిన అత్యాచారాలను వివరిస్తూ మంత్రి ఉద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నారు. అనంతరం తేరుకొని తన ప్రసంగాన్ని కొనసాగించారు. డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు ఇస్తున్న సున్నా వడ్డీ రుణాలను వినియోగించుకొని ఆర్థికంగా బలపడాలన్నారు. పదివేల మంది మహిళలతో మరోసారి సాలూరులో మహిళారక్షణ సదస్సు నిర్వహిస్తామని తెలిపారు.

సమస్యలు చెప్పండి

ఏమైనా సమస్యలుంటే తనతో చెప్పాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు మంత్రి సూచించారు. సమస్యల పరిష్కారం పేరుతో సంఘాలు పెట్టాల్సిన అవసరం లేదన్నారు. క్షేత్రస్థాయిలో నెలకొన్న ఇబ్బందులను పీడీ లేదా తన దృష్టికి తేవాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు రోడ్లు, భవనాలు మంజూరుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లల్లో అర్హులైన వారికి సామాజిక పింఛను అందించే విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. దీపావళి నుంచి మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించడానికి సీఎం చంద్రబాబు ఆదేశాలిచ్చారని చెప్పారు. ఈ సదస్సులో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, జేసీ శోభిక, ఏఎస్పీ అంకిత్ మహావీర్ సురాన, డీఈవో జి.పగడాలమ్మ, ఐసీడీఎస్ ఆర్జేడీ చిన్మయదేవి. పీడీ రాణి, సీడీపీవో విజయలక్ష్మి, ఎంపీడీవో పార్వతి, మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ దీప్తి, మహిళా కౌన్సిలర్లు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

43 మద్యం షాపులకు 117 దరఖాస్తులు

- అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన్ కిషోర్

పార్వతీపురం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): నూతన మద్యం పాలసీలో భాగంగా ఇప్పటివరకు జిల్లాలో 43 షాపులకు 117 దరఖాస్తులు అందాయని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన్ కిషోర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా తొమ్మిది షాపులకు దరఖాస్తులు రావల్సి ఉందన్నారు. ఈనెల 9వ తేదీ వరకు గడువు ఉందని, ఆదివారం కూడా దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. 11న కలెక్టర్ సమక్షంలో డ్రా తీసి షాపులను కేటాయిస్తామని పేర్కొన్నారు. పార్వతీపురం, సీతానగరం, సాలూరు, కురుపాం, పాలకొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని, ఎటువంటి పుకార్లను నమ్మవద్దని స్పష్టం చేశారు.

నోటీసులు సరే.. చర్యలేవీ?



పాఠశాల, దేవాలయానికి కేటాయించిన స్థలంలో పునాదులు వేసిన దృశ్యం

పార్వతీపురం టౌన్, అక్టోబరు 5 : పట్టణంలోని కొత్తవలస గ్రీన్‌ఫీల్డ్ కాలనీలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వారికి అధికారులు నోటీసులిచ్చి సరిపెట్టారు. నెలలు గడుస్తున్నా.. ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే... కొన్నేళ్ల కిందట కొత్తవలస సమీపంలో పేదలకు స్థలాలు కేటాయించారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. అదే ప్రాంతంలో మరికొంత మందికి 240 స్థలాలు మంజూరు చేశారు. రెండేళ్లలో ఆ ప్రాంతం గ్రీన్‌ఫీల్డ్ కాలనీగా రూపాంతరం చెందింది. అయితే ఆ కాలనీలో 188-1, 3 సర్వే నంబర్‌లో స్థలాన్ని సామాజిక భవనం, ఓపెన్ సైట్ డవలప్‌మెంట్‌తో పాటు పాఠశాల, దేవాలయం, క్రీడా మైదానం కోసం 16 సెంట్లు కేటాయించారు. కాగా రెండేళ్ల కిందట కొంత మంది రాజకీయ నాయకులు ఆ ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణాలు కూడా చేపట్టారు. కొంతమంది పునా దులు కూడా వేశారు. దీంతో గత ఏడాది మే నెలలో 1, 8 వార్డుల కౌన్సిలర్లు ఆర్.శివకుమార్, కె.నారాయణరావు ఇతర ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి కనకరావుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆరు నెలల కిందట ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చారు. గత నెలలో జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు దృష్టికి ఈ విషయాన్ని తీసుకొచ్చారు. అయితే ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని జిల్లాకేంద్ర వాసులు కోరుతున్నారు.

తేడాలుంటే చర్యలు తప్పవు

- ఈ-క్రాప్ నమోదుపై హెచ్చరించిన సబ్ కలెక్టర్

గరుగుబిల్లి, అక్టోబరు 5 : ఈ-క్రాప్ వివరాల నమోదులో తేడాలుంటే చర్యలు తప్పవని పార్వ తీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ హెచ్చరించారు. శనివారం గరుగుబిల్లిలో ఈ-క్రాప్ నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి సమాచారాన్ని సేకరించారు. ' వ్యవ సాయ శాఖ వ్యవసాయశాఖ సిబ్బంది నిర్వహించిన ఈ-క్రాప్ పరిశీలనకు కొన్ని గ్రామాలను గుర్తించాం.. ప్రత్యేక యాప్ ద్వారా సూపర్ చెక్ చేస్తాం. గతంలో రైతులు వేసిన పంట ఒక రకం అయితే, ఈ-క్రాప్‌లో మరో పంట నమోదు చేయ రాదు. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదు.' అని ఆయన తెలిపారు. మండల వ్యవసాయాధికారిణి ఆర్.విజయభారతి మాట్లాడుతూ 16,032 ఎకరాల్లో ఈ-క్రాప్ పూర్త యిందన్నారు. 15 వేల ఎకరాల్లో వరి, 1,032 ఎకరాల్లో అరటి, ఆయిల్ పామ్, కాయగూరలు పంటలు సాగవుతున్నట్లు వివరించారు. పీఎం కిసాన్ కింద 18వ విడతలో 8 వేల మందికి రూ.2 వేల చొప్పున మంజూరైనట్లు చెప్పారు. ఈకేవైసీకి గడువు పెంచినట్లు వెల్లడించారు. ఈ పరిశీలనలో వ్యవసాయశాఖ సిబ్బంది వంశీకృష్ణ, కావ్య పాల్గొన్నారు.



ఈ-క్రాప్ నమోదుపై సిబ్బందితో చర్చిస్తున్న సబ్ కలెక్టర్

లోటుపాట్లు తలెత్తకూడదు

- పౌష్టికాహారం పంపిణీపై కలెక్టర్ ఆదేశం

సీతానగరం, అక్టోబరు 5 : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని, లేకుంటే సహించేది లేదని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ హెచ్చరించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల విషయంలో ఎటువంటి లోటుపాట్లు తలెత్తినా ఉపేక్షించబోమని తేల్చి చెప్పారు. శనివారం చినబోగిలి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు పట్టిక, స్టాక్ రిజిస్టర్లు, నిల్వ ఉన్న గుడ్లు, బియ్యం, పప్పు, ఆయిల్, తదితర సామగ్రిని పరిశీలించారు. పిల్లల బరువు, ఎత్తును చూసిన ఆయన కేంద్రానికి పూర్తి స్థాయిలో పిల్లలు హాజరుకాకపోవడంపై ఆరా తీశారు. అనంతరం అక్కడున్న చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. సరైన పద్ధతిలో పిల్లలకు బోధించాలని సిబ్బందిని ఆదేశించారు. వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆహారం తీసుకునే ముందు చేతులు కడుక్కునేలా చూడాలని సూచించారు. గర్భిణులకు టేక్ హోం రేషన్ అందించాలన్నారు. అనంతరం సీతానగరంలో నిర్మాణ దశలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పనులు వేగవంతం చేయాలని సంబం ధిత అధికారులను ఆదేశించారు. కాశయ్యపేటలో నమోదైన ఈ-క్రాప్‌ను యాప్ ద్వారా సరిపోయినది లేదని తనిఖీ చేశారు. స్థానిక రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీతానగరంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను కలెక్టర్ సందర్శించారు. దరఖాస్తులు ఆన్‌లైన్ చేసే విధానం, తదుపరి చేపట్టబోయే చర్యలపై ఆరా తీశారు.



చిన్నారుల ఎత్తు చూస్తున్న కలెక్టర్

వాహనాల్లో కుక్కి.. కర్కశంగా తరలించి..

- యథేచ్ఛగా పశువుల అక్రమ రవాణా
- వారానికి ఐదువేలకు పైగా కబేళాకు తరలింపు
- అంతంతమాత్రంగానే దాడులు

(కొమరాడ)

జిల్లా కేంద్రంగా పశువుల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతుంది. వారానికి కనీసం రెండు నుంచి ఐదు వేల పశువులు ఇతర ప్రాంతాల్లోని కబేళాలకు తరలిపోతున్నాయి. వీటిలో కనీసం పదో వంతు కూడా పట్టుకున్న దాఖలాలు లేవు. ఈ దందాలో లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. అధికారులు, నాయకులకు ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా పార్వతీపురం, నవగాం, సీతంపేట, తదితర సంతల్లో వ్యాపారులు రైతుల నుంచి పశువులను కొనుగోలు చేస్తున్నారు. వాటిని జాతీయ రహదారి సమీపంలో ఖాళీ ప్రదేశాల్లో ఒక దగ్గరకు చేర్చి రాత్రిపూట లారీలు, ఇతర వాహనాల్లో కుక్కి తరలిస్తున్నారు. మరికొందరైతే కంటైనర్లలో రహస్యంగా కబేళాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గత కొంత కాలంగా పశువుల అక్రమ రవాణాపై దాడులు అంతంత మాత్రంగానే ఉన్నాయన్న విమర్శలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో నిర్వహించే సంతలో దళారులు అధిక సంఖ్యలో పశువులను కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారుల ఏజెంట్లకు విక్రయిస్తుంటారు. అదేవిధంగా ఆంధ్రాకు సరిహద్దు ప్రాంతంగా ఉన్న ఒడిశా (రాయగడ సమీపం)లో పశువులను కొనుగోలు చేసి కొమరాడ, గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల మీదుగా ఆంధ్ర ప్రాంతానికి తీసుకువచ్చి ఇక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారు.

- ఈ నెల 2న ఒడిశా రాష్ట్రం రాయగడ నుంచి కొమరాడ మీదుగా పార్వతీపురానికి ఆరు బొలెరో వాహనాల్లో 30 పశువులను కుక్కేసి తరలిస్తుండగా కొమరాడ పోలీసులు పట్టుకున్నారు. ఎటువంటి అనుమతి ప్రతాలు లేకపోవడంతో పశువులను స్వాధీనం చేసుకుని వాహనాలను సీజ్ చేశారు. ఆరుగురుని అరెస్టు చేశారు.

నిబంధనలకు తూట్లు..

పశువుల తరలింపు, రవాణాకు అనుమతి పత్రాలు తప్పనిసరి. సుదూర ప్రాంతాలకు వ్యవసాయ పనుల నిమిత్తం, పాడి అవసరాలకు తరలిస్తున్నా మని ధ్రువీకరిస్తూ ప్రభుత్వ అధికారులు, సిబ్బంది నుంచి అనుమతి తీసుకోవాలి. వాహనాల విషయంలో సైతం నిబంధనలు పాటించాలి. పశువులు ఎక్కడానికి, దిగడానికి వాహనాలు అనువుగా ఉండాలి. గాలి, వెలుతురు ఉండేలా చూడాలి. వైద్య కిట్లు వాహనంలో అందుబాటులో ఉండాలి. సుదూర ప్రాంతాలకు తీసుకెళ్తున్నట్టు అయితే పశుగ్రాసం ఉంచాలి. అవి నిల్చునే వెసులబాటు ఉండాలి. కానీ జిల్లాలో ఇవేవీ పాటించిన దాఖాలాలు లేవు. రవాణా విషయంలో కనీస స్థాయిలో కూడా నిబంధనలు పాటించడం లేదు. ఒక కంటైనర్‌లో 23 పశువులు మాత్రమే తీసుకెళ్లాల్సి ఉండగా, 40 నుంచి 50 మూగజీవాలను కుక్కి తరలిస్తున్నారు. చిన్న లారీల్లో 8, పెద్ద లారీల్లో 12 వరకు పశువులను తీసుకెళ్లాల్సి ఉండగా 20 నుంచి 30 వరకు తరలిస్తున్నారు. గంటల తరబడి సాగే ఈ ప్రయాణంలో ఆ మూగజీవాల వ్యథ వర్ణణాతీతం. దారిపొడవునా కనీసం వాటికి ఆహారం వేయడం లేదు. దీంతో ఆకలి, దప్పికతో అలమటించే పశువులు మార్గమధ్యలో మృత్యువాత పడుతున్నాయి. ఇంత జరుగుతున్నా పోలీసులు, పశుసంవర్ధక శాఖ, ఇతర అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మూగజీవాల రక్షణకు చర్యలు చేపట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు.





జిల్లా నుంచి అక్రమంగా పశువులను తరలిస్తున్న దృశ్యం

రాజేంద్రప్రసాద్ ఇంట విషాదం

గుండెపోటుతో కూతురు గాయత్రి మృతి





సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ ఇంట విషాదం నెలకొంది. ఆయన కూతురు గాయత్రి (38) హఠాన్మరణమే ఇందుక్కారణం. శుక్రవారం రాత్రి ఛాతీలో నొప్పితో హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చేరిన ఆమె.. చికిత్స తీసుకుంటూ తుదిశ్వాస విడిచారు. మరణానికి కారణం గుండెపోటని డాక్టర్లు తెలిపారు. సినీ ప్రముఖులు చిరంజీవి, వెంకటేశ్, అల్లుఅర్జున్, సాయి కుమార్, ఎన్టీఆర్, త్రివిక్రమ్‌తో పాటు కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు, రాజేంద్రప్రసాద్‌ను పరామర్శించి ప్రగాడ సానుభూతి వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా సంతాపం ప్రకటించారు.

కూతురిలో తల్లిని చూసుకుంటూ...

2018లో 'బేవర్స్' అనే సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో భావోద్వేగానికి గురయ్యారు రాజేంద్ర ప్రసాద్. ఆ వేడుకలో ఆయన మాట్లాడుతూ "నా పదవ ఏట అమ్మను కోల్పోయాను. అమ్మ నన్ను వదిలివెళ్లడంతో తట్టుకోలేకపోయాను. నా జీవితమంతా అమ్మ లేని లోటు నన్ను వెంటాడుతూ ఉండేది. కానీ గాయత్రి పుట్టాక.. తనలోనే అమ్మను చూసుకున్నాను. కానీ ఇప్పుడు నాకు, నా కూతురికి మాటలు లేవు. నా అంగీకారం లేకుండానే తను ప్రేమించిన వ్యక్తిని పెళ్లి చేసుకుని వెళ్లిపోయింది. అప్పటి నుంచి తనతో మాట్లాడటం మానేశాను. ఈ సినిమా కోసం సుద్దాల అశోక్ తేజ రాసిన పాట 'తల్లీ తల్లీ నా చిట్టి తల్లి నా ప్రాణాలే పోయాయమ్మా.. నువ్వే లేని లోకాన నేను శవమల్లే మిగిలానమ్మా' విన్నాను. విన్న వెంటనే నా కళ్ల నిండా కన్నీళ్లొచ్చాయి. ఆ రోజు సాయంత్రం నా కూతురిని ఇంటికి పిలిపించి ఈ పాటను నాలుగు సార్లు తనకి వినిపించాను. ఆ పాట విన్నాక నా కూతురిపై కోపం పోయింది. అమ్మ చనిపోయినప్పుడు ఎలా అయితే ఏడ్చానో.. అలా ఏడ్చేశా" అని అన్నారు. కాగా, రాజేంద్రప్రసాద్‌కు తన కూతురు గాయత్రి అంటే పంచప్రాణాలు. ఈ మధ్యనే తనకు ఓ ఖరీదైన కారు, విలాసవంతమైన భవంతిని బహుమతిగా ఇచ్చారు. గాయత్రి న్యూట్రీషియనిస్ట్‌గా పనిచేసేవారు. కే.పీ.హెచ్.బీలోని తన భర్త రాజ్ కుమార్, కూతురు సాయితేజస్వినితో ఉండేవారు. సాయితేజస్విని 2018లో విడుదలైన 'మహానటి' సినిమాలో చిన్ననాటి సావిత్రి పాత్రతో బాలనటిగా వెండితెరపై అరంగేట్రం చేసింది. ఆ తర్వాత మూడు సినిమాల్లో నటించింది. కేపీహెచ్‌బీలోని ఇందు ఫార్చ్యూన్ ఫీల్డ్స్ విల్లా నెంబర్ 266లో ఉన్న రాజేంద్రప్రసాద్ నివాసానికి గాయత్రి పార్థీవ దేహాన్ని తీసుకొచ్చారు. అక్కడకు రాజకీయ సినీ ప్రముఖులు వచ్చి పార్థీవ దేహానికి నివాళులర్పించారు. కేపీహెచ్‌బీ ఏడో ఫేజ్‌లోని హిందూ స్మశాన వాటికలో నేడు ఉదయం పది గంటలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



గద్దలకొండ... తరహాలో

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా దర్శకుడు కరుణకుమార్ తెరకెక్కిస్తున్న పీరియాడిక్ చిత్రం 'మట్కా'. నవంబర్ 14న విడుదలవుతోంది. డాక్టర్ విజయేందర్‌రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్నారు. నోరా ఫతేహి,మీనాక్షి చౌదరి కథానాయికలు. నవీన్‌చంద్ర, అజయ్ ఘోష్ కీలకపాత్రలు పోషించారు. శనివారం చిత్రబృందం విజయవాడలోని రాజ్ యువరాజ్ థియేటర్‌లో 'మట్కా' టీజర్‌ను ఆవిష్కరించింది. నాలుగు విభిన్నమైన పాత్రల్లో వరుణ్‌తేజ్ మేకోవర్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వరుణ్‌తేజ్ మాట్లాడుతూ 'నేను 'గద్దల కొండ గణేశ్' సినిమా చేశాక చాలా మంది 'మరోసారి అలాంటి సినిమా చేయండి'అని అడిగారు. 'మట్కా' కూడా అదే తరహాలో ఉండబోతోంది. నా కెరీర్‌లో గర్వపడే సినిమా అవుతుందని భావిస్తున్నాను' అని చెప్పారు. వరుణ్‌తేజ్‌ను ఇప్పటిదాకా చూడని సరికొత్త పాత్రలో చూడబోతున్నారు అని కరుణ కుమార్ చెప్పారు. ఇప్పటివరకూ ఒక లెక్క, ఇకపై వరుణ్ కటౌట్ మరోలెక్క అన్నట్లుగా సినిమా ఉండబోతోందని డా. విజయేందర్‌రెడ్డి చెప్పారు. ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: ఏ. కిశోర్ కుమార్



ఆకట్టుకునే నాన్న కథ

సుధీర్‌బాబు హీరోగా నటిస్తున్న కుటుంబ కథా చిత్రం 'మా నాన్న సూపర్ హీరో'. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో సునీల్ బలుసు నిర్మించారు. ఈ నెల 11న విడుదలవుతోంది. శుక్రవారం ఈ చిత్రం ట్రైలర్‌ను మహేశ్‌బాబు విడుదల చేసి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. కన్నతండ్రి, పెంచిన తండ్రి ప్రేమను పొందేందుకు కథానాయకుడికి ఎదురైన ఇబ్బందులు ఏమిటి?, ఆ సమస్యను అధిగమించేందుకు అతను ఎలాంటి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నాడు అనే అంశం చుట్టూ ఆసక్తికరంగా అల్లుకున్న కథ అని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. ఇందులో ఆర్నా కథానాయికగా నటిస్తున్నారు. సాయిచంద్, షాయాజీ షిండే ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: జై క్రిష్, సినిమాటోగ్రఫీ: సమీర్ కల్యాణి.

ఆ 30 నిముషాల ట్రైన్ ఎపిసోడ్ అలరిస్తుంది



గోపీచంద్ హీరోగా శ్రీను వైట్ల దర్శకత్వంలో రూపొందుతున్న 'విశ్వం' చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు శ్రీను వైట్ల మీడియాతో మాట్లాడుతూ చిత్ర విశేషాలు వెల్లడించారు.

● గోపీచంద్‌తో సినిమా చేయాలని ఎప్పటినుంచో అనుకుంటున్నాం. ఆయన్ని దృష్టిలో పెట్టుకుని రాసిన కథ ఇది. ఆయనకు నచ్చి ఓకే చేశారు. నా శైలిలో రావాలని ఎనిమిది నెలలు టైమ్ తీసుకున్నా. అభిరుచి కలిగిన నిర్మాత దోనేపూడి ప్రసాద్‌తో పాటు విశ్వప్రసాద్ కూడా జాయిన్ అవడంతో సినిమాకు మరింత బలం వచ్చింది. యాక్షన్, హిలేరియస్ ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్స్‌తో సినిమా ఉంటుంది. ఇందులో ఓ పాప పాత్ర కీలకంగా ఉంటుంది.

● దర్శకుడిగా నాకు గ్యాప్ వచ్చినా సినిమాలు చూస్తూ వస్తున్న మార్పులు గమనిస్తూనే ఉన్నా. నా శైలి గురించి సోషల్ మీడియాలో చర్చ జరుగుతూనే ఉంది. ఏదో ఒక చోట నా కంటెంట్ వస్తూనే ఉంది. థీమ్‌లు రిపీట్ అవుతున్నాయని అంటున్నారు. దాన్ని క్రాక్ చేయడానికి టైమ్ పడుతుంది.

● పదేళ్ల క్రితం హీరో తెలివితేటలతో ఏదైనా సాధించగలడనే కథలు వచ్చాయి. ఈ సినిమా అలా ఉండదు. ఒక బర్నింగ్ ఇష్యూ తీసుకుని వినోదాత్మకంగా చెప్పా. మేకింగ్ వైజ్ వినూత్నంగా ఉంటుంది. నాకు, గోపీకి ఫ్రెష్ ఫిల్మ్ అవుతుంది.

● ఈ సినిమాలోనూ ట్రైన్ ఎపిసోడ్ ఉంది. ట్రైన్ ఎపిసోడ్ అనగానే 'వెంకీ' సినిమాతో కంపేర్ చేస్తారని తెలుసు. కానీ దానికీ దీనికీ చాలా తేడా ఉంటుంది. 30 నిమిషాల పాటు వెన్నెల కిశోర్, గణేశ్, నరేశ్, కవిత, చమ్మక్ చంద్ర, షకలక శంకర్‌లతో ట్రైన్ జర్నీ బాగుంటుంది.

● విశ్వం అనే పాత్ర జర్నీ ఈ చిత్రం. ఎమోషనల్ యాక్షన్ సినిమా అని చెప్పవచ్చు. జర్నీలో విశ్వానికి ఎలాంటి వ్యక్తులు కలిశారు, ఆ విషయాలు ఏమిటి అనేవి ఆసక్తికరంగా ఉంటుంది. కంటెంట్ స్ట్రాంగ్‌గా ఉంటేనే థియేటర్‌కు ప్రేక్షకులు వస్తున్నారు. ఆడియన్స్ కూడా వెంకీ తరహా సినిమాలు మిస్ అవుతున్నాయని అంటున్నారు. అందుకే కేర్ తీసుకుని ఈ సినిమా చేశా.



అలరించే హంగులతో...

శ్రద్ధాదాస్, అజయ్, మాస్టర్ మహేంద్రన్ ప్రధాన తారాగణంగా రూపొందిన చిత్రం 'త్రికాల'. 'స్క్రిప్ట్ ఆఫ్ గాడ్' అనేది ట్యాగ్‌లైన్. మణి తెల్లగూటి దర్శకత్వంలో రాధికా శ్రీనివాస్ నిర్మించారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం టైటిల్ పోస్టర్‌ను నిర్మాత దిల్‌రాజు ఆవిష్కరించి యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పురాణాల స్ఫూర్తితో రాసుకున్న కథ ఇది, ఈతరం ప్రేక్షకులను అలరించేలా అన్ని హంగులతో తెరకెక్కించాం అని దర్శకుడు తెలిపారు. సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించే చిత్రమిదని నిర్మాత చెప్పారు. సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, సినిమాటోగ్రఫీ: పవన్ చెన్నా

జాతీయ పురస్కారం రద్దు



మహిళా కొరియోగ్రాఫర్‌పై అత్యాచారం కేసులో పోక్సో చట్టం కింద అరెస్టయిన టాలీవుడ్ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆయనకు అందించాల్సిన జాతీయ అవార్డును రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం శనివారం నిర్ణయం తీసుకొన్నది. ఈ నెల 8న ఢిల్లీలో జరగనున్న జాతీయ అవార్డుల ప్రధానోత్సవంలో జానీ మాస్టర్ ఉత్తమ కొరియోగ్రాఫర్‌గా అవార్డును అందుకోవాల్సి ఉంది. 2022 సంవత్సరానికి గాను తమిళ చిత్రం 'తిరుచిత్రంబలం'కు గాను ఆయనకు ఈ పురస్కారం లభించింది. దీంతో ఆ వేడుకలకు హాజరయ్యేందుకు ఆయన బెయిల్ కోరగా రంగారెడ్డి కోర్టు మంజూరు చేసింది. కానీ అత్యాచారం కేసులో అరెస్టవడంతో కేంద్ర ప్రభుత్వం ఆయనకు ఇవ్వాల్సిన పురస్కారాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.

22 ఏళ్ల తర్వాత...



క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీ దర్శకత్వంలో రవితేజ, శ్రీకాంత్, ప్రకాశ్‌రాజ్, సోనాలిబింద్రే నటించిన చిత్రం 'ఖడ్గం' రీ రిలీజ్‌కు సిద్ధమైంది. సినిమా విడుదలైన 22 ఏళ్లకు రీ రిలీజ్ అవుతుండడంతో చిత్రబృందం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శకులు కృష్ణవంశీ మాట్లాడుతూ "భారతీయ జెండా ఒక ఖడ్గం అనే ఉద్దేశం వచ్చేలా ఈ సినిమాకు టైటిల్ పెట్టాం. ఇన్నేళ్ల తర్వాత రీ రిలీజ్ అవుతుండడంతో చాలా సంతోషంగా ఉంది" అని చెప్పారు.

ఇన్ ప్రోగ్రెస్

మాస్ పాత్రలో తొలిసారి



వెంకట్ హీరోగా నటించిన 'హరుడు' చిత్రం గ్లింప్స్ శనివారం విడుదల చేశారు. రాజ్ తాళ్లూరి దర్శకత్వంలో డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి నిర్మించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్మాత మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం దర్శకుడు రాత్రింబవళ్లు కృషి చేశారు. సినిమాలోని పాటలు ఆదరణ పొందుతాయి' అన్నారు. కథ విన్న ఐదు నిముషాల్లో ఒకే చేసిన నిర్మాతకు దర్శకుడు కృతజ్ఞతలు తెలిపారు. వెంకట్ ఐదేళ్ల జర్నీ ఉందనీ, ఆయన ఇందులో మాస్ హీరోగా నటించారని చెప్పారు. హీరో వెంకట్ మాట్లాడుతూ 'కమర్షియల్ ఎలిమెంట్స్ కలిగిన మాస్ చిత్రం ఇది. షూటింగ్‌తో పాటు 60 శాతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు కూడా పూర్తయ్యాయి. ఇందులో తొలిసారిగా మాస్ పాత్ర చేశాను. నా పాత్రకు దీటుగా హెబ్బా పటేల్ పాత్ర ఉంటుంది. నటాషాసింగ్ మరో పాత్ర చేసింది. సలోని స్పెషల్ సాంగ్ చేసింది' అని చెప్పారు.

టైమ్ ట్రావెల్ మూవీ



సాయిరోనక్, అమృత చౌదరి జంటగా నటించిన 'రివైండ్' చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఎన్నారై కల్యాణ్ చక్రవర్తి స్వీయ దర్శకత్వంలో ఈ సినిమా నిర్మించారు. శనివారం విడుదల చేసిన ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌లో హీరో మాట్లాడుతూ 'మంచి కంటెంట్ ఉంటే కచ్చితంగా ప్రేక్షకులు ఆదరిస్తారు. అందుకే మంచి కథను ఎన్నుకుని మాకున్న బడ్జెట్‌లోనే సినిమా తీశాం. మా దర్శకుడు కల్యాణ్ ఎన్నారై అయినా ఇక్కడికి వచ్చి డబ్బు పెట్టి మంచి కథతో సినిమా తీయడం అభినందనీయం' అన్నారు. 'ఆదరణ ఉంటుందని మేం కూడా టైమ్ ట్రావెల్ కథను ఎన్నుకొని ఆసక్తికరంగా చిత్రాన్ని రూపొందించాం. ప్రేక్షకులకునచ్చుతుందని మా నమ్మకం' అని చెప్పారు దర్శకనిర్మాత కల్యాణ్.

ప్రజలకు మరిన్ని సదుపాయాలు కల్పిస్తాం

● బస్సు సర్వీస్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కోళ్ల

శృంగవరపుకోట: ప్రజలకు అన్ని రంగాల్లో మరిన్ని సదుపాయాలు కల్పిస్తామని ఎస్‌కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శనివారం శృంగవరపుకోట ఆర్టీసీ డిపో నుంచి విశాఖపట్టణానికి పల్లె వెలుగు బస్సును ప్రారంభించారు. నష్టాల బాటలో ఉన్న ఆర్టీసీని ఆర్థికంగా నిలబెట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. విద్య, వైద్యం, ఉపాధి నిమిత్తం విశాఖకు వెళ్లే వారందరికీ ఈ బస్సు అనుకూలంగా ఉంటుందన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు జీ.ఎస్ నాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, పట్టణ పార్టీ అధ్యక్షుడు కొండదం మల్లేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జి కాపుగంటి వాసు, బీశెట్టి అరుణ, పెదగాడ రాజు తదితరులున్నారు.



ఎస్.కోటలో పల్లె వెలుగు బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల

కోర్టు భవనాల నిర్మాణానికి కృషి



శృంగవరపుకోట: శిథిలావస్థలో ఉన్న శృంగవరపుకోట కోర్టు భవనాల స్థానంలో కొత్త కోర్టు భవనాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేలా కృషి చేస్తానని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణ చక్రవర్తి అన్నారు. శనివారం విజయనగరం రోడ్డులో తాత్కాలిక జూనియర్ సివిల్ జడ్జి, సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు భవనాలను ప్రారంభించారు. ప్రత్యేక పూజలు చేశారు. తాత్కాలిక కోర్టు భవనాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక న్యాయ మూర్తి సబ్బవరపు వాణి, సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ అప్పలనాయుడు, న్యాయవా దుల సంఘ అధ్యక్షుడు జీ.ఎస్ దేముడు, న్యాయవాదులు మండా కామేశ్వరరావు, అల్లు సత్యాజీ, నానిగిరి తులసీ దాస్, బొబ్బిలి రామకృష్ణ, డబ్ల్యూఎస్ శర్మ తదితరులున్నా రు.

తాత్కాలిక కోర్టును ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయి కల్యాణ చక్రవర్తి

అన్నపూర్ణగా అమ్మవారు

విజయనగరం రూరల్, అక్టోబరు 5: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రోజుకో అవతారంలో దర్శనమిస్తున్న పైడిమాంబ శనివారం నాడు అన్నపూర్ణ మాతగా భక్తులకు దర్శనమిచ్చారు.. రైల్వేస్టేషన్ రోడ్డులో వున్న వనంగుడిలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మూడులాంతర్లు రోడ్డులో వున్న పైడిమాంబ చదురుగుడిలో కూడా భక్తులు అధిక సంఖ్యలో పైడిమాంబను దర్శించుకున్నారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పైడిమాంబను దర్శించుకున్నారు.. పైడిమాంబకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ● రైల్వే స్టేషన్ రోడ్డులో వున్న పైడిమాంబ వనంగుడిలో అన్నదాన కార్యక్రమం కొనసాగిస్తున్నారు. శనివారం నుంచి భక్తులు కూర్చొని తినేవిధంగా బెంచీలను ఒక దాత అందించారు..అంతకముందు బఫే విధానంలో అన్నదాన కార్యక్రమం ఇక్కడ జరిగేది.. ఈ నేపథ్యంలో ఆలయ ఈవో డీవీ ప్రసాదరావు ఈ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ఆహారపదార్థాలను వడ్డించారు. బెంచీలను ఇచ్చిన దాతను అభినందించారు.



విజయనగరం: వనంగుడిలోని పైడితల్లి





బొబ్బిలి: అన్నపూర్ణ అలంకరణలో దాడితల్లి అమ్మవారు, బంగారమ్మతల్లి

అన్నపూర్ణాదేవిగా బంగారమ్మతలి

బొబ్బిలి: బొబ్బిలి ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గల బంగారమ్మతల్లి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు.ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

చదరంగంతో సృజనాత్మకత



కార్యక్రమంలో మాట్లాడుతున్న లోక్‌సత్తా పార్టీ నేత బాబ్జీ

విజయనగరం దాసన్నపేట: విద్యార్థుల్లో సృజానాత్మకతను పెంపొందించడానికి చదరంగం క్రీడ ఎంతో దాహోదపడతాయని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ అన్నారు. ప్రముఖ చదరంగం క్రీడాకారుడు కేవీ జ్వాలాముఖి ఆధ్వర్యంలో రింగురోడ్డు సమీపంలోని ఫోర్త్, ఫైర్ సెస్ స్కూల్ ఆధ్వర్యంలో రెవెన్యూ హోంలో రాష్ట్ర ఓపెన్ చెస్ టోర్నమెంటు నిర్వ హించారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు చదరంగం చాలా ఉపయోగకరమైందన్నారు. జాతీయ స్థాయి చదరంగం పోటీలు విజయనగరంలో అద్భుతంగా జరిగాయని, విద్యార్థులు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారన్నారు. జన విజ్ఞానవేదిక జాతీయ నాయకుడు ఎంవీఆర్ కృష్ణాజీ మాట్లాడుతూ ఇంతటి గొప్ప పోటీలు జరగడం ఆనందంగా ఉంద న్నారు. చెస్ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బీఏ రావు మాట్లాడుతూ, ఈ క్రీడలు విద్యార్థులు చక్కగా అవగాహనతో ముందుకు వెళ్లాలన్నారు. దామోదరరావు, జగన్నాథ్‌తో పాటు చదరంగం క్రీడాకారులు పాల్గొన్నారు.

నవదుర్గ అలంకరణ



వేణుగోపాల స్వామి ఆలయంలో నవ దుర్గ అలంకరణ

శృంగవరపుకోట: శృంగవరపుకోట శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం జరగనున్న పూజలకు శనివారం సాయంత్రం నవదుర్గా అలంకరణ చేశారు. ఉదయం 9గంటలకు జరగనున్న నవదుర్గల పూజకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

విజయనగరం క్రైం: జిల్లా పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, నేర ప్రవృత్తిని విడనాడాలని లేకుంటే అటువంటివారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఎస్పీ ఆదేశాలతో జిల్లాలోని పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీట్ కలిగిన వ్యక్తులను స్థానిక పోలీస్ స్టేషనల్‌కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తులు మరల నేరాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించి సత్ప్రవర్తనతో జీవించేలా కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. నేరప్రవృత్తిని విడనాడకుండా నేరాలకు పాల్పడితే ఉపేక్షించవద్దని ఆదేశాంచారు. ప్రస్థుతం వారు ఏ వృత్తిలో కొనసాగుతున్నది కనిపెట్టాలన్నారు. ఎక్కడ ఉంటున్నది అన్న అంశాలను సంభందిత పోలీస్ అధికారులు విచారణ చేసి హిస్టరీ షీట్లులో పొందుపరచాలన్నారు.

గ్రామాలపై దృష్టి పెట్టండి

వేపాడ: గ్రామస్థాయిలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలపై దృష్టిచెట్టి తక్షణమే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని గ్రామ సచివాలయ మహిళా పోలీసులకు వల్లంపూడి ఎస్ఐ బి.దేవి సూచించారు. శనివారం స్టేషన్‌లో ఈ మేరకు ఆమె సచివాలయ మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. గ్రామ సచివాలయ మహిళా పోలీసులు గ్రామస్థాయిలో జరిగే అసాంఘిక కార్యక్రమాలను గుర్తించి పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామ స్థాయిలో నిర్వహిస్తున్న అక్రమ మద్యం వ్యాపారాలు, కోడిపందాలు, పేకాటపై సమాచారం ఇస్తే వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు.



గ్రామ సచివాలయ మహిళా పోలీస్‌లతో సమావేశమైన వల్లంపూడి ఎస్ఐ దేవి

కల్వర్టు నిర్మాణానికి భూమి పూజ

శృంగవరపుకోట: శృంగవరపుకోట కోట వీధిలో కల్వర్టు నిర్మాణానికి తాజా మాజీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు శనివారం భూమి పూజ చేశారు. ఈ కల్వర్టు నిర్మాణానికి మండల ప్రజా పరిషత్ రూ.3 లక్షలు మంజూరు చేసింది. ఎంపీపీ సండిసోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు, సర్పంచ్ సంతోషి కుమారి తదితరులు ఉన్నారు.



కల్వర్టుకు భూమి పూజ చేస్తున్న ఇందుకూరి రఘురాజు

ఇసుక సరఫరాకు ఇబ్బంది లేకుండా చర్యలు

● బొబ్బిలి ఆర్డీవో రామ మోహనరావు

తెర్లాం: ఇసుక సరఫరా చేసేందుకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని బొబ్బిలి ఆర్డీవో రామ మోహనరావు ఇన్‌చార్జి తహసీల్దార్ సత్యనారాయణను ఆదేశించారు. శనివారం మండలంలోని కుసుమూరులోని ఇసుకరీచ్‌ను పరిశీలించారు. ఇసుక పంపిణీ ప్రారంభిం చేందుకు అనుకూలంగా ఉండే సౌకర్యాలపై ఆరాతీశారు.

ఉపాధ్యాయులకు సన్మానం

రాజాం: రాజాం శాఖా గ్రంథాలయంలో సైన్స్, సాంఘిక ఉపాధ్యాయులు రౌతు నరసింహప్పుడు, కుదమ తిరుమలరావును ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని శనివారం గ్రంథ పాలకుడు యంద్రాపు అమరనాథ్ సన్మానించారు. భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు శాసుబిల్లి హరిబాబు, ఐఈడీ ఉపాధ్యాయలు వి.శ్రీనివాసరావు, వంజరాపు రాము, జగదీష్ ఉన్నారు.

ఇసుక సమస్య పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

రాజాం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసి ఇసుక సమస్య పరిష్కరించాలని, నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాజాంలో భవన నిర్మాణ కార్మికులు నిరసన తెలిపారు. యూనియన్ నాయకులు తవిటినాయుడు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

నియామక ఉత్తర్వులు చెల్లవు

కలెక్టరేట్: బొబ్బిలి సీబీఎం బాలికోన్నత పాఠశాలకు సంబంధించి కన్వీనర్, కరస్పాండెంట్‌లు ఆయా పాఠశాలలో చేసిన ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది నియామకాలు నిబంధనలకు విరుద్ధమని డీఈవో ప్రేమ్‌కుమార్ తెలిపారు. విద్యాశాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా చేసినందున ఆయా నియామక ఉత్తర్వులు చెల్లవని శనివారం ఆయన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

సందడిగా అన్నసమారాధన

జామి: జామి బజారుసెంటరులో గోస్తనీ మహిళలు ఏర్పాటుచేసిన కనకదుర్గమ్మ ఉత్సవాల్లో భాగంగా శనివారం సందడిగా అన్నసమారాధన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

గోతులు పూడ్చండి

జామి: మండలంలోని భీమసింగి వంతెనపై ఉన్న పెద్ద పెద్ద గోతులను కప్పించడంతో పాటు వంతెనపై లైటింగ్ ఏర్పాటు చేయిచాలని, విజయనగరం దారిలో ఉన్న గోతులను కప్పించాలని కోరుతూ జిల్లా ఆర్‌అండ్‌బీ ఈఈకి మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు శనివారం వినతి పత్రం అందించారు. ఈ గోతుల వల్ల నిత్యం ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం, ఆస్తినష్టం సంభవిస్తున్నాయని, వీటిని నివారించాలని కోరారు.

12న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

రామభద్రపురం: మండలంలోని ఆరికతోటలో ఈనెల 12న అంబేడ్కర్, జగ్జీవన్‌రావు విగ్రహాలను ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగ ఆవిష్కరించనున్నట్లు ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోగి శ్రీను మాదిగ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ కు సంబంధించి విజయోత్సవ సభ నిర్వహిస్తు న్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు పెంకి రవికుమార్ పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌ను విజయవంతం చేయాలి

రామభద్రపురం: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల ఎనిమిదో తేదీన బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన ఆధ్వర్యంలో జరగనున్న ప్రజాదర్బార్ విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతినాయుడు కోరారు. శనివారం బూసాయవలసలో విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీలకు చెందిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో టీడీపీ నాయకుడు సువ్వాడ హరి బాబు, రౌతు శంకరరావు, సీర వేణు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ బ్లడ్ గ్రూప్ తెలుసుకోవాలి

రాజాం: ప్రతి ఒక్కరూ వారి రక్తం గ్రూపును తెలిసుకోవాలని జీఎంఆర్ఐటీ ప్రిన్సిపాల్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. శనివారం రాజాంలో 1200 మందికి బ్లడ్ గ్రూపింగ్‌చేసి కార్డులు అందజేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ రాజాం అధ్యక్షుడు కొత్తా సాయి ప్రశాంత్ కుమార్, నాగేశ్వరరావు, ఆర్ ఎల్ నాయుడు, కేవీఎస్ ప్రసాద్, పెంకి చైతన్యకుమార్, ఉమాశంకర్ పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

రేగిడి: ఆశావర్కర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే చొరవచూపి పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతంచేస్తామని ఆశావర్కర్ల యునియన్ మండల గౌరవాధ్యక్షుడు సీహెచ్ రామమూర్తినాయుడు, యునియన్ మండలాధ్యక్షురాలు రత్నకూమారి తెలిపారు. శనివారం మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఆశావర్కర్ల యునియన్ మండల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశావర్కర్లకు ప్రభుత్వాలు గొడ్డుచాకరీ చేయించుకుని, వారి హక్కులు కాలరాసి అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో కార్యదర్శి సావిత్రి, ప్రతినిధులు శాభారాణి, నాగమణి, ఈశ్వరమ్మ, అమ్మాజమ్మ పాల్గొన్నారు.

ప్రకృతి సాగుపై ఆసక్తి పెంచుకోండి

వేపాడ: జిల్లా రైతులు ప్రకృతి వ్యవసాయ సాగుకు ముందుకు రావాలని జిల్లా వ్యవసాయాధికారి విటి.రామారావు పిలుపునిచ్చారు. శనివారం వేపాడ మండలంలోని వల్లంపూడి, వేపాడ, దబ్బిరాజుపేట, గ్రామాల్లో రైతులు సాగు చేపట్టే ప్రకృతి వ్యవసాయ సాగు ను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కొత్తవలస వ్యవసాయశాఖ ఏడీఏ ఎల్ విజయ, మండల వ్యవసాయాధికారి యశ్వవంతరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు. ● **బొబ్బిలి రూరల్:** మండలంలోని కృష్ణాపురంలో శనివారం ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి ఉరిటి శంకరరావు రైతులకు తూటికాడ కషాయం తయారుచేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.సింహాచలం, ఐసీఆర్‌పీ జి.శ్రీరామ నాయుడు, రైతులు పాల్గొన్నారు.

సంతకవిటి తహసీల్దార్‌గా సత్యం

సంతకవిటి: సంతకవిటి తహసీల్దార్‌గా బి.సత్యం శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన శ్రీకాకుళం జిల్లా పలాస నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ తహసీల్దార్ గా పనిచేసిన టి.కల్యాణ చక్రవర్తి పలాస తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు.

వెలుగు ఏపీఎంగా భాగ్యలక్ష్మి

బొబ్బిలి రూరల్: బొబ్బిలి వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్‌గా పక్కి భాగ్యలక్ష్మి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏపీఎంగా పనిచేసిన శ్రీనివాసరావు ఎస్.కోట శ్రీనిధి మేనేజర్‌గా బదిలీపై వెళ్లారు. దీంతో బాడంగి మండలం నుంచి భాగ్యలక్ష్మి బదిలీపై వచ్చారు. భాగ్యలక్ష్మివెలుగు కార్యాలయ సిబ్బంది అభినందించారు.

కొత్తవలస ఎంపీడీవోగా రమణయ్య

కొత్తవలస: కొత్తవలస ఎంపీడీవోగా రమణయ్యను నియమించారు. ఇటీవల జరిగిన రెగ్యులర్ బదిలీలలో ఇక్కడ పని చేస్తున్న వై.పద్మజను కురుపాం బదిలీ చేయగా ఆమె స్థానంలో శ్రీ కాకుళం జిల్లా నుంచి కొత్తవలస మండలానికి రమణయ్య బదిలీపై వచ్చి జాయిన్ అయ్యారు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలు ఎందుకు?

● వాడీవేడిగా సాగిన మండల సర్వసభ్య సమావేశం

రామభద్రపురం: సమస్యలు పరిష్కారం కాని సమావేశాలు ఎందుకు నిర్వహించాలని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ప్రశ్నించారు. శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన వాడీవేడిగా జరిగింది. తొలుత రొంపల్లి ఎంపీటీసీ భవిరెడ్డి శంకరరావు మాట్లాడుతూ టీడీపీ మద్దతుదారుల పంచాయతీల్లో పనుల విషయంలో అలసత్వం చూపు తున్నారని ఆరోపించారు. అసంపూర్తిగా మిగిలిఉన్న పనులను ఎప్పటిలోగా పూర్తిచేస్తారని ప్రశ్నించారు. ఎంపీటీసీ సభ్యురాలు రవణమ్మ మాట్లాడుతూ కొట్టక్కిలో ఐసీడీఎస్‌కు శాశ్వత భవనం లేకపోవడంతో అద్దె భవనంలో పిల్లలు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జన్నివలస పరిధిలో 1.5 కిలోమీటర్లలో 600 మొక్కలు నాటామని ఏపీవో గొలగాని త్రినాథరావు తెలియజేయగా, అక్కడ మొక్కలు లేకపోయినా బిల్లులు చెల్లిస్తున్నారని ఎంపీటీసీ సభ్యులు మడక తిరుపతిరావు ఆరోపించారు. రామభద్రపురం కనిమెరక వీధిలో ఇనుప స్తంభాలు మార్చాలని ఎంపీటీసీ సభ్యుడు భవిరెడ్డి చంద్ర కోరారు. మామిడివలసలో తాగునీటి సమస్య పరిష్కరించాలని అధికారులకు విన్నవించినా ఎందుకుపట్టించుకోవడం లేదని ఎంపీటీసీ సభ్యులు మడ క తిరుపతినాయుడు ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీసర్వే వల్ల రైతులు నష్టపోయారని మిర్తివలస సర్పంచ్ మజ్జి రాంబాబు తెలిపారు. దీంతో రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. దీనిపై రైతు లంతా మూకుమ్మడిగా మండల రెవెన్యూ కార్యాలయానికి తాళంవేసే రోజు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు. కాగా మహిళా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుల భర్తలు సమావేశంలో ప్రశ్నలు అడగడంపై పలువురు విస్మయం వ్యక్తం చేశారు. విద్యుత్ తదితర సమస్యలపై సభ్యులు నిలదీశారు. ఆయా శాఖల అధికారులు సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతమ్మ, ఎంపీడీవో రత్నం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





సర్వసభ్య సమావేశం దృశ్యం, అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

రాజాం రూరల్: పట్టణంలోని బొబ్బిలి రోడ్డులోని ఓ ప్రైవేటు జూట్ కర్మాగారంలో కార్మికుడిగా పని చేస్తున్న రాజయ్యపేట గ్రామానికి చెందిన చిన్నారావు (30) శుక్రవారం సాయంత్రం ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు ఎస్ఐ రవికిరణ్ తెలిపారు. విధులు ముగించుకుని బయటకు వస్తున్న సమయంలో కాంపౌండ్‌లో గల స్తంభానికి తాకడంతో విద్యుదాఘాతానికి గురైనట్లు చెప్పారు. చిన్నారావు భార్య చంద్రకళ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

కొత్తవలస: మండలంలోని సంతపాలెం గ్రామ శివారు మామిడి తోటలో పేకాట శిబిరంపై కొత్తవలస సీఐ షణ్ముఖరావు సిబ్బందితో కలిసి దాడి చేశారు. శనివారం సాయంత్రం వచ్చిన సమాచారంతో ఎస్ఐ సుదర్శనరావు, సిబ్బందితో కలసి పేకాట శిబిరంపై దాడి చేయగా ఒక లక్షా 23 వేల 540 రూపాయలు నగదు, ఒక ఆటో, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం

రాజాం రూరల్: రాజాం సర్కిల్ కార్యాలయం ప్రాంగణంలో చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు ఆధ్వర్యంలో సీఐ అశోక్‌కుమార్, సిబ్బంది ఏడాదిగా అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన మద్యాన్ని శనివారం ధ్వంసం చేశారు. 172 కేసులకు సంబంధించి రూ.1.50 లక్షలు విలువచేసే 1215 బాటిళ్లను ధ్వంసం చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

నవరాత్రి ఉత్సవాల్లో అగ్నిప్రమాదం

విజయనగరం క్రైమ్: జిల్లా కేంద్రంలోని న్యూపూర్ణ సెంటర్, నగర పాలక సంస్థ కార్యాలయం సమీపంలో శనివారం సాయంత్రం శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గా దేవి డెకరేషన్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఏటా శరన్నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా టాక్సీ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. దుర్గాదేవికి డెకరేషన్ చేసిన విద్యుత్ వైర్లలో షార్ట్ సర్క్యూట్ జరగడంతో అక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలకు నిప్పు అంటుకుని మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సమీపంలో అగ్నిమాపక కార్యాలయం ఉండడంతో వెంటనే అగ్నిమా పక సిబ్బంది ఫైర్ ఇంజిన్ వాహనం ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తెచ్చారు. అగ్నిమాపక అధికారులు వెంటనే స్పందించడంతో పెద్ద ప్రమా దం త్రుటిలో తప్పింది. దీనిపై అగ్నిమాపక అధి కారి శోమేశ్వరరావు వివరణ కోరగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం సంభవించిందని, సుమారు లక్ష రూపాయల ఆస్తి నష్టం ఉంటుందని తెలిపారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారుల ప్రతిభ

శృంగవరపుకోట: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అక్టోబరు 1న ఇంటర్ కాలేజ్ బ్యాడ్మింటన్ టీం చాంపియన్ షిప్‌లో శృంగవరపుకోట ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారులు పంపాన మౌనిక భరణి, కనక హరిక ద్వితీయ స్థానం పొందినట్లు కోచ్ పట్నూరు శ్రీరాములు తెలిపారు. ఈ క్రీడాకారులు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదవుతున్నారు. వీరు ఇంతకు ముందు కూడా అనేక జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో రాణించినట్లు తెలిపారు. క్రీడాకారులను ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ కేశవరావు, ఫిజికల్ డైరెక్టర్ ఆర్.శివకుమార్ అభినందించారు.



క్రీడాకారులతో కోచ్ శ్రీరాములు

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

బొబ్బిలి/రూరల్: బొబ్బిలికి చెందిన షేక్‌అబ్దుల్లా, రెడ్డి సృజన గత నెల 25న విజయనగరంలో జరిగిన స్కూల్ గేమ్స్ పోటీల్లో సత్తాచాటి అండర్ -14 రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు కోచ్ ఎం.సుధాకరయాదవ్ తెలిపారు. ఈ మేరకు వీరు శనివారం నుంచి తిరుపతిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. వారిని ఎమ్మెల్యే బేబీనాయన అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న బేబీనాయన

ఆరుగురు బాల కార్మికుల గుర్తింపు



బొబ్బిలిలో షాపులను తనిఖీ చేస్తున్న సీఐ సతీష్‌కుమార్

బొబ్బిలి: బొబ్బిలిలో సీఐ కటకం సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు, వివిధ శాఖల అధికారులు ఆపరేషన్ స్వేచ్ఛఫేజ్-3 కార్యక్రమంలో భాగంగా శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆరు షాపుల్లో ఆరుగురు బాల కార్మికులను అధికారులు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. బాలల సేవలను వినియోగిస్తున్న షాపుల యజమానులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ సతీష్‌కుమార్ మాట్లాడుతూ బాలలను శారీరక శ్రమతో కూడిన పనుల్లో వినియోగించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌లేబర్ ఆఫీసరు జి.గౌరీశంకర్, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి వెంకటరమణ, సీఎస్‌డబ్ల్యూవో ప్రతినిధి హరీశ్ పాల్గొన్నారు.

కాపు, బలిజి సంక్షేమసేన అధ్యక్షుడి నియామకం

బొబ్బిలి: బొబ్బిలి నియోజకవర్గ కాపు, బలిజి సంక్షేమసేన అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన తెలుగుయువత నాయకుడు నంది హరిప్రకాశ్‌ను నియమించారు. ఈ మేరకు రాష్ట్రసేన వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య నుంచి ఆయనకు నియామక ఉత్తర్వులు శనివారం అందాయి.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

● మంత్రి సంధ్యారాణి ● విశ్వనాథపురంలో పర్యటన



విశ్వనాథపురంలో పర్యటిస్తున్న మంత్రి సంధ్యారాణి

పాచిపెంట: ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. డయేరియాతో ఇద్దరు మృతి చెందిన నేపథ్యంలో ఆమె శనివారం విశ్వనాథపురంలో పర్యటించారు. అక్కడ గల బాధితులను పరామర్శించారు. డయేరియాకు గల కారణాలు వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆరుబయట మల మూత్ర విసర్జన చేయకూడదని, బాత్‌రూములను వినియోగించుకోవాలని సూచించారు. డయేరియా పూర్తిగా తగ్గుముఖం పట్టేనంత వరకు వైద్య శిబిరం కొనసాగిస్తూ 108 వాహనాన్ని గ్రామంలోనే ఉంచాలని ఆదేశించారు. పాఠశాలలు సెలవులు అయినందున వైద్య శిబిరాన్ని పాఠశాలలోకి మార్చాలని ఆమె సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోవద్దని తెలిపారు. మంత్రి వెంట జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ప్రోగ్రాం ఆఫీసర్ రఘు, తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లి ఆలయ అభివృద్ధికి సహకరిస్తా

● డీఎస్పీ రాంబాబు

గరుగుబిల్లి: ఉత్తరాంధ్రలో చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి శ్రీవేంకటేశ్వర, కోదండరామస్వామి ఆలయాల అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరిస్తామని పాలకొండ డీఎస్పీ రాంబాబు హామీ ఇచ్చారని జట్టు సంస్థ వ్యవస్థాపకుడు డా.డి.పారినాయుడు తెలిపారు. ఆయన శనివారం పాలకొండలో డీఎస్పీని కలిశారు. ఈసందర్భంగా తోటపల్లి ఆలయ అభివృద్ధికి కొంతమంది ఆటంకం కల్పిస్తున్నారని, అభివృద్ధిని అడ్డుకుంటున్నారని తెలియజేశారు. ఆలయ ప్రాంతంలోని కొంతమేర స్థలం ఆక్రమణకు గురైందని, ఆక్రమణదారులు తప్పుడు కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని డీఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. ఆలయ ప్రాంతాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు చేపడతామని డీఎస్పీ హామీ ఇచ్చారు. డీఎస్పీని కలిసిన వారిలో హరికుమార్, కొండలరావు, నాని, తదితరులు ఉన్నారు.

రహదారుల నిర్మాణానికి అంచనాలు



శంబరలో పరిశీలిస్తున్న పీఆర్‌డీఈ చిన్నంనాయుడు

మక్కువ: శంబర గ్రామంలో పోలమాంబ అమ్మవారి జాతర సమయంలో సిరిమాను తిరిగే ప్రదేశాలు, చదురుగుడి, వనంగుడి సమీప ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించడానికి పీఆర్‌డీఈ చిన్నమనాయుడు శనివారం అంచనాలు రూపొందించారు. ఎన్ని మీటర్ల మేర రహదారి నిర్మాణానికి అనుకూలంగా ఉంటుందో కొలతలు తీశారు. ఈ కార్యక్రమంలో పోలమాంబ ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ, పీఆర్ఏఈ రంజిత్, ఎంపీటీసీ తీళ్ల పోలినాయుడు ఉన్నారు.

కేంద్ర బృందం పర్యటన

పార్వతీపురం రూరల్: పార్వతీపురం మండలంలోని లక్ష్మీనారాయణపురం తదితర గ్రామాల్లో కేంద్ర ఉపాధి హామీ పథకం బృందం శనివారం పర్యటించింది. ఎం.శాస్యప్పన్, కేజీ సాలెంకుమార్‌తో కూడిన అధికారుల బృందం మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను, వాటి వివరాలను తెలుసుకున్నారు. వేతనదారులతో మాట్లాడుతూ వేతనం అందుతున్నది లేనిది తెలుసుకున్నారు. సామాజిక పింఛను లబ్ధిదారులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌వో రామన్, ఏపీడి శ్రీహరి, ఏపీవో కృష్ణారావు, జేఈ సోమేశ్వరరావు తదితరులు ఉన్నారు.

పట్టణాభివృద్ధికి చేయూత అందించాలి

సాలూరు రూరల్: కొద్దిరోజుల కిందట జనసేనలో చేరిన సాలూరు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జరజాపు దీప్తి, తదితరులు శనివారం సాలూరులో మంత్రి సంధ్యారాణిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పట్టణాభివృద్ధికి చేయూతను అందించాలని ఆమెను కోరారు. మంత్రిని కలిసిన వారిలో కౌన్సిలర్లు పప్పల లక్ష్మణ, రాపాక మాధవరావు, ప్రసాద్, సాలూరు అర్బన్ బ్యాంక్ చైర్మన్ జరజాపు ఈశ్వరరావు, మాజీ కౌన్సిలర్ జరజాపు సూరిబాబు ఉన్నారు. వారితో పాటు జనసేన నాయకుడు గొర్లె తిరుపతినాయుడు(జీటీ) పాల్గొన్నారు.

శివశంకర్‌ను కలిసిన జనసేన నాయకులు



శివశంకర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న జనసేన నాయకులు

మక్కువ: విజయవాడలో ఆంధ్రప్రదేశ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తమ్మిరెడ్డి శివశంకర్‌ను జనసేన మండల నాయకుడు పెంట తిరుపతిరావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్వతీపురం నియోజకవర్గం ఇన్‌చార్జి ఆదాడ మోహన్‌రావు, పార్టీ విజయనగరం నాయకుడు గురాన అయ్యలు పాల్గొన్నారు.

'మత్స్య' సహకార సంఘ ఎన్నిక ఏకగ్రీవం



ఎన్నికైన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం

గరుగుబిల్లి: మండలంలోని నాగూరు శ్రీస్వదేశీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘ ఎన్నికలు శనివారం ఏకగ్రీవంగా జరిగాయి. సంఘం పరిధిలోని సభ్యులు అధ్యక్షుడిగా ఆర్.రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు, అరకు పార్లమెంటు బీసీ సెల్ ఉపాధ్యక్షుడు అంబటి రాంబాబులు బలపర్చారు. దీంతో అధ్యక్ష స్థానానికి పోటీ లేకపోవడంతో రామకృష్ణను అధ్యక్షునిగా ఎన్నిక చేస్తూ ఎన్నికల అధికారి పి.మన్మథరావు ధ్రువీకరించారు. ఉపాధ్యక్షుడిగా వి.భాస్కరరావు, డైరెక్టర్లుగా వి.అప్పన్న, ఆర్.కృష్ణ, సీహెచ్ పరిశందొర, వి.శాంతందొర, ఆర్.పోలయ్యలను ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులను పలువురు అభినందించారు.

కుక్కల స్వైర విహారం



వీరఘట్టంలో గుంపులుగా సంచరిస్తున్న శునకాలు

వీరఘట్టం: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోనూ కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. పలువురు కుక్క కాట్లకు గురవుతూ ఆసుపత్రికి పరుగులు తీస్తున్నారు. శనివారం కిమ్మి గ్రామానికి చెందిన ధనలక్ష్మి కుక్కకాటుకు గురైంది. కుటుంబ సభ్యులు వెంటనే వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చి చికిత్స నిర్వహించారు. అధికారులు స్పందించి కుక్కలను అదుపు చేయాలని కోరుతున్నారు.

విద్యలో మిన్న.. సౌకర్యాలు సున్నా

● అర్ధాంతరంగా అదనపు గదులు
● వసతిగృహంలోనే తరగతులు ● ప్రహరీ లేని వైనం
● ఇదీ రేగులపాడు కేజీబీవీ దుస్థితి



అర్ధాంతరంగా నిలిచిన రేగులపాడు కేజీబీవీ అదనపు తరగతి గదుల పనులు

వీరఘట్టం: ఆ పాఠశాలలో ఉత్తమమైన విద్య అందిస్తున్నప్పటికీ కనీస వసతులకు నోచుకోవడం లేదు. వీరఘట్టం మండలంలోని రేగులపాడు గ్రామం వద్ద గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) గత రెండు సంవత్సరాలుగా ఉత్తమ పాఠశాలగా రాష్ట్ర స్థాయిలో అవార్డులు అందుకుంది. సిబ్బంది కొరత కూడా లేదు. ఉత్తమమైన విద్యను అందిస్తున్నారు. కానీ ఈ పాఠశాల కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు. ఉత్తమ బోధనతో పాటు కనీస వసతి సౌకర్యాలు కూడా కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 243 మంది విద్యార్థినులు ఉన్నారు. వీరు కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ పూర్తి స్థాయిలో తరగతులు లేవు. వసతిగృహంలోనే కొన్ని తరగతులు నిర్వహించాల్సి వస్తోంది. దీంతో విద్యార్థినులకు అవస్థలు తప్పడం లేదు. అలాగే పాఠశాల చుట్టూ ప్రహరీ కూడా లేదు. దీంతో విద్యార్థినులు రాత్రిపూట భయాందోళనకు గురవుతున్నారు. ఎటువంటి రక్షణ లేని పరిస్థితిలో కాలం వెల్లదీస్తున్నారు.

అరకొర పనుల కారణంగా అవస్థలు

గత వైసీపీ హయాంలో నాడు-నేడు పథకంలో భాగంగా ఈ పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. సుమారు ఎనిమిది నెలల కిందట ఎన్నికల ముందు హడావుడిగా రూ.80లక్షలతో పనులు ప్రారంభించారు. ప్రారంభించిన కొద్ది రోజులకే ఎక్కడి పనులు అక్కడే విడిచిపెట్టారు. ఈ అర్ధాంతర పనుల కారణంగా వర్షా కాలంలో శ్లాబు పై నుంచి నీరు కారుతోంది. దీంతో వసతిగృహంలో విద్యార్థులు ఇబ్బందులు పడున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అదనపు తరగతి గదులు త్వరితగతిన పూర్తి చేయాలని, అలాగే పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

శ్లాబు నుంచి నీరు కారుతోంది

అర్ధాంతరంగా ఉన్న అదనపు తరగతి గదుల పనుల వల్ల శ్లాబు నుంచి నీరు కారడంతో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో ప్రహరీ మంజూరైనప్పటికీ నిధులు చాలవని కాంట్రాక్టర్ ముందుకు రాలేదు. ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తాం. ఈ విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టాం.

- ఐ.ప్రమీల, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, కేజీబీవీ, రేగులపాడు

సామాన్యులకు అందుబాటులో లిక్కర్ పాలసీ

● సాలూరు ఎక్సైజ్ సీఐ దాసు
● మద్యం షాపుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మద్యం పాలసీ సామాన్యులకు కూడా అందుబాటులో ఉన్న ఫ్రెండ్లీ లిక్కర్ పాలసీ అని సాలూరు ఎక్సైజ్ సీఐ గులిపిల్లి దాసు అన్నారు. ఆయన శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. సాలూరు పరిధిలో కాకుండా పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రకటించిన మద్యం షాపులకు సాలూరులో కూడా దరఖాస్తు ఇవ్వవచ్చునన్నారు. సాలూరు పట్టణంలో ఐదు షాపులు, మండలంలో రెండు షాపులు మంజూరైనట్టు చెప్పారు. ఇవి కాకుండా మక్కువ, పాచిపెంట మండలాలకు కూడా మద్యం షాపులు మంజూరై ఉన్నాయన్నారు. సామాన్యులు దరఖాస్తు చేసుకునే విధంగా వీలు కల్పించారని చెప్పారు. దరఖాస్తు డీడీ రూ.2లక్షలు ఈనెల 9 నాటికి కల్లా తీయాలన్నారు. మద్యం షాపుల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 9న ఆఖరు తేదీ అన్నారు. ఈ నెల 11న లాటరీ ద్వారా షాపులను కేటాయిస్తారని తెలిపారు. ఈనెల 12 నాటికి ఆయా షాపులకు తాము స్టాక్‌ను అందించడానికి కార్యాచరణ చేశామని ఆయన తెలియజేశారు.



మద్యం షాపులకు వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది

58 దరఖాస్తులు రాక

సాలూరు సర్కిల్ మద్యం షాపులకు శనివారం సాయంత్రం నాటికి 58 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ సీఐ దాసు చెప్పారు. షాపు మంజూరైతే మొత్తంలో కేవలం ఆరో వంతు తొలుత చెల్లించాల్సి ఉందన్నారు. అమ్మకాలు అనంతరం విడతలు వారీగా చెల్లించాలని చెప్పారు. మద్యం షాపులను నిబంధనలు ప్రకారమే నిర్వహణకు వీలుగా ప్రత్యేక పర్యవేక్షణ చేస్తామన్నారు.

గజరాజుల హల్‌చల్

● భయాందోళన చెందుతున్న ప్రజలు



కవిటిభద్ర, లచ్చిరాజుపేట గ్రామాల మధ్య సంచరిస్తున్న ఏనుగులు

పార్వతీపురం రూరల్: పార్వతీపురం మండలం కవిటిభద్ర, లచ్చిరాజుపేట తదితర గ్రామాల్లో గజరాజులు సంచరిస్తున్నాయి. దీంతో ఆయా గ్రామస్థులు బెంబేలెత్తిపోతున్నారు. అవి ఏ సమయంలో ఎక్కడ ఉంటాయో.. ఎవరిపై దాడి చేస్తాయో తెలియక ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం తోటలు, పంట పొలాల్లో ఏనుగులు సంచరిస్తున్నాయి. దీంతో తమ పంటలు నాశనమవుతున్నాయని రైతులు వాపోతున్నారు. గతంలో ఎప్పుడూ ఇలా లేదని, తక్షణమే ఈ ప్రాంతం నుంచి ఏనుగులను తరలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై అటవీ శాఖ ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.

సర్పంచ్‌లకు రేపటి నుంచి శిక్షణ

గరుగుబిల్లి: మండలంలోని సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు ఈనెల 7వ తేదీ నుంచి శిక్షణ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.పైడితల్లి, ఏవో ఎస్.అర్జునరావు తెలిపారు. వీరు శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మండలంలోని 25 పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లకు, వార్డు మెంబర్లకు ఈనెల 10వ తేదీ వరకు పలు అంశాలపై శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈనెల 7 నుంచి 8వ తేదీ వరకు సర్పంచ్‌లకు, 9 నుంచి 10వ తేదీ వరకు వార్డు మెంబర్లకు గ్రామాల అభివృద్ధిపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. సంబంధిత పంచాయతీ కార్యదర్శులు శిక్షణకు హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

గిరిజన రహదారులకు నిధులు మంజూరు

గుమ్మలక్ష్మీపురం: ప్రధానమంత్రి జన జాతీయ గ్రామ్ ఉన్నత అభియాన్ పథకం ద్వారా గిరిజన గ్రామాల రోడ్డు నిర్మాణాలకు నిధులు మంజూరు అయ్యాయని ఐటీడీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడారు. గుజ్జవాయి-దేరింగుపాడు రహదారికి రూ.21.30 లక్షలు, జుంబిరి-కేదారిలంకకు రూ.11.90, తిత్తిరిరోడ్డు- గాలిమానుగూడకు రూ.21.07, తిత్తిరిరోడ్డు-పులిపుట్టుకు రూ.9.53, తిత్తిరి-గూనుగూడకు రూ.12.67, తిత్తిరి- ఎగువ పులిపుట్టికు రూ.33.45, నాయుడుగూడ-సందిగూడకు రూ.30.15, రాముడుగూడ-బొడ్డుగాడిగూడకు రూ.22.13, సందిగూడ-సాలిడంగుకు రూ.16.65, పులిపుట్టి-గుమ్మిడిగూడకు రూ.18.74 లక్షలు మంజూరైనట్టు వెల్లడించారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో చండీయాగం

● పూజల్లో పాల్గొన్న చీపురుపల్లి ఎమ్మెల్యే కళా



పూజలు నిర్వహిస్తున్న కళా వెంకటరావు

పాలకొండ: పట్టణంలోని కాశీ అన్నపూర్ణసమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో దసరా నవరాత్రుల్లో భాగంగా శనివారం చండీయాగం నిర్వహించారు. ఈ యాగంలో చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు పాల్గొన్నారు. ఆలయ అర్చకుడు జోస్యుల అంజిబాబు ఆయనతో రుద్రాభిషేకం, చండీయాగం చేయించారు. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్యవైశ్య సంఘ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం ఆర్యవైశ్య జిల్లా సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆ సంఘ పెద్దలు పెంటపాటి సాయికిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొంటారని చెప్పారు.

అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ

● కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు
● ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం దుర్గమ్మతల్లి అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పాలకొండలోని కోటదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదానం నిర్వహించారు. దాతల సహాయంతో మజ్జిగ పంపిణీ చేశారు. జిల్లాలోని అన్ని అమ్మవారి ఆలయాలతో పాటు మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.
(ఆంధ్రజ్యోతి బృందం)



పాలకొండ: కోటదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ



పాలకొండ: కోటదుర్గమ్మ ఆలయంలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిస్తున్న ఉత్సవ విగ్రహం



మక్కువ: అన్నపూర్ణాదేవిగా శంబర పోలమాంబ



సాలూరు రూరల్: సాలూరులో అన్నపూర్ణ అవతారంలో సంతోషిమాత



సీతంపేట రూరల్: సీతంపేటలోని సంతోషిమాత దేవాలయంలో పూజలు



గరుగుబిల్లి: నాగూరులో కుంకుమ పూజలు



వీరఘట్టం: కోటదుర్గమ్మ ఆలయంలో భవానీల పూజలు

సత్యకు అభినందనలు

క్లుప్తంగా..



సత్యను సత్కరిస్తున్న భూదేవి

పాలకొండ: విజయవాడలోని మారిటైం బోర్డు కార్యాలయంలో నూతనంగా చైర్మన్‌గా శనివారం బాధ్యతలు చేపట్టిన దామచర్ల సత్యకు టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి అభినందనలు తెలిపారు. అనంతరం శాలువా కప్పి సన్మానించారు. బోర్డు చైర్మన్‌గా సత్య బాధ్యతలు తీసుకోవడం ఆనందంగా ఉందని భూదేవి తెలిపారు.

సామాజిక బాధ్యత కలిగిఉండాలి

సాలూరు రూరల్: మహిళా పోలీసులు సామాజిక బాధ్యత కలిగిఉండాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సత్యనారాయణ సూచించారు. సాలూరులోని తన చాంబర్‌లో ఆయన శనివారం మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఉందన్నారు. మహిళా పోలీసులు తమ పరిధిలో ఇటువంటి సమస్య లేకుండా చూడాలని కోరారు. అలాగే తమ పరిధిలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

విజయవాడకు సైకిల్ యాత్ర



సైకిల్ యాత్ర ప్రారంభించిన విష్ణుమూర్తి

సాలూరు రూరల్: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దీక్ష నేపథ్యంలో మామిడిపల్లి నుంచి భవానీ గురుస్వామి మరడ విష్ణుమూర్తి శనివారం విజయవాడకు సైకిల్ యాత్ర ప్రారంభించారు. వెళ్లే మార్గంలో సనాతన ధర్మం, తిరుమల లడ్డూ ప్రాశస్త్యంపై వివరించనున్నట్టు ఆయన తెలిపారు. సాలూరు ప్రాంతం నుంచి విజయవాడకు సైకిల్ యాత్ర ప్రారంభించడం ఇదే ప్రథమం కావడం విశేషం. ఆయన యాత్ర ద్విజయం కావాలని మామిడిపల్లిలో భవానీ దీక్షాదారులు అమ్మవారికి పూజలు చేశారు.

కురుపాంలో రక్తదాన శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ ప్రదీప్‌దేవ్

కురుపాం: వాయుపుత్ర సేవా సంఘం ఆధ్వర్యంలో కురుపాంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని మాజీ ఎంపీ వైరిచర్ల ప్రదీప్ చంద్రదేవ్ ప్రారంభించారు. ఈసందర్భంగా 25 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పి.నారాయణరావు, కళింగ వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు అందవరపు కోటేశ్వరరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.